## క్లుప్తంగా

### అయ్యప్ప ఆలయంలో అన్నసమారాధన



స్వాములకు అన్నప్రసాదం అందిస్తున్న దాతలు ఆళ్ల నారాయణరావు దంపతులు

**అక్కిరెడ్డిపాలెం:** శీలానగర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో నిత్య అన్నసమారాధనకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం జరిగిన అన్నసమారాధనకు ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆళ్ల నారాయణరావు రూ.20 వేలు ఆర్థిక సహకారం అందించారు. సేవా సంఘం అధ్యక్షుడు, గురుస్వామి అదపాక వెంకటరమణ, ప్రతినిధులు సీహెచ్.మురళీశ్వరరావు, సమటాపు అప్పలనాయుడు, పొలమరశెట్టి బూలిరాజు, లక్ష్మణరావు, ఎస్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కృత్రిమ మేధస్సుతో గణనీయమైన మార్పులు



సదస్సులో పాల్గొన్న విద్యార్థులతో అధ్యాపకులు

**అగనంపూడి:** కృత్రిమ మేధస్సు (ఏఐ) తో సాంకేతిక రంగంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. కృత్రిమమేధస్సుపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 12వ తేదీ నుంచి వారం రోజుల పాటు ఏక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సపోర్ట్ ఆటోమేషన్, సంభాషణాత్మక మేధస్సు సహాయంతో విద్యార్థుల క్లిష్టమైన ప్రశ్నలకై నా సెకన్లలో సమాధానాలు దొరుకుతున్నాయన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, సీఈవో శ్రీకాంత్, ఎంసీఏ హెచ్‌వోడీ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ సీనియర్ నాయకుడు మృతి

**పెదగంట్యాడ:** బీజేపీ సీనియర్ నాయకుడు పేర్ల దానయ్య గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భౌతిక దేహం వద్ద బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు తదితరులు నివాళులర్పించారు.

### సజ్జల దృష్టికి ప్రైవేట్ పాఠశాలల సమస్యలు



సజ్జలకు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు

**గాజువాక :** ప్రైవేట్ పాఠశాలల సమస్యలను రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల సంఘం (అప్సా) ప్రతినిధులు ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్సీ కల్పలత ఆధ్వర్యంలో తాడేపల్లిలో రామకృష్ణారెడ్డిని కలిసిన అప్సా నాయకులు సమస్యలను వివరించారు. గతేడాది గుర్తింపు పొందిన పాఠశాలల గుర్తింపును ఎనిమిదేళ్లకు పెంపు ఆఫ్‌లైన్ ఫైళ్ల పరిష్కారం తదితర అంశాలపై వినతిపత్రం అందజేశారు. దీనిపై రామకృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించారని అప్సా జిల్లా కార్యదర్శి పాలవలస భాస్కరరావు తెలిపారు. సుందరరాం, చంద్రశేఖరరావు, జనార్ధన్, సుబ్రమణ్యరాజు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

### డిసెంబర్ 18న వారణాసిలో విశ్వశాంతి మహాయజ్ఞం

**మద్దిలపాలెం :** ప్రపంచ శాంతికి డిసెంబర్ 18న వారణాసిలో 25 వేల హోమగుండాలతో మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు విహంగం యోగ సందేశ్ ప్రతినిధులు సమిత్‌కుమార్, ఓజా, సుశీల్ తెలిపారు. పీతాపురం కాలనీలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ యజ్ఞానికి హాజరయ్యేందుకు ప్రధాని మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అంగీకరించినట్లు పేర్కొన్నారు.



# భక్తిశ్రద్ధలతో నాగులచవితి

- నాగదేవత కొండకు పోటెత్తిన భక్తులు
- పుట్టల వద్ద ప్రత్యేక పూజలు



కొండపై కొలువుదీరిన నాగదేవత



నాగదేవత కొండపై పుట్టల వద్ద పూజలు చేస్తున్న భక్తులు



నాగదేవత కొండపై భక్తుల సందడి



సీతానగరంలో..

**అగనంపూడి:** నాగులచవితిని నియోజకవర్గవాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఉదయం 11.30 గంటల వరకే చవితి ఉండటంతో, వేకువజాము నుంచే పుట్టల వద్ద భక్తుల సందడి మొదలైంది. కుటుంబసమేతంగా వచ్చి పుట్టలో పాలు పోసి, గుడ్లు, చలిమిడి, చిమిలి వేసి భక్తిని చాటుకున్నారు. మందుగుండు సామగ్రి పేల్చి సంబరాలు చేసుకున్నారు.

**నాగదేవతకు ప్రత్యేక పూజలు**

దువ్వాడ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న నాగదేవత కొండకు భక్తుల తాకిడి పెరిగింది. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి అమ్మవార్ని దర్శించుకున్నారు. కొండపైనున్న వివిధ దేవతామూర్తులకు పూజలు చేశారు. కొండపై ఉన్న పుట్టల వద్ద భక్తులు బారులు తీరారు. వందలాది మంది మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి కొండపై తలనీలాలు సమర్పించారు. సాయంత్రం అమ్మవారి కొండ దిగువన పరస నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున మందుగుండు సామగ్రిని పేల్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీల సారథ్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ చేపట్టారు.

**భెల్ టౌన్‌షిప్ వద్ద..**

**అక్కిరెడ్డిపాలెం:** నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని భెల్ టౌన్‌షిప్ వద్ద పుట్టలకు పూజ చేసేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. టౌన్ షిప్‌లో అనేకప్రాంతాల్లో పుట్టలు ఉండటంతో, భక్తులు కిక్కిరిశారు. గతంలో భెల్ టౌన్‌షిప్‌లో ఎదుర్కొన్న ట్రాఫిక్ సమస్య పునరావృతం కాకుండా, ఈ సారి సంస్థ సెక్యూరిటీ సిబ్బంది జాగ్రత్తలు తీసుకున్నారు. గాజువాక, పంతులుగారి మేడ, రాంనగర్, గుడివాడ అప్పన్నకాలనీ, మిండి, రాజీవ్‌నగర్, కాళికానగర్, గిరిప్రసాద్ నగర్ కాలనీ, రాజీవ్‌నగర్, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, శీలానగర్, వెంకటేశ్వర కాలనీ, హరిజన జగ్గయ్యపాలెం తదితర ప్రాంతాల నుంచి కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలపై భక్తులు వచ్చారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సిబ్బంది చర్యలు చేపట్టారు.

**పెదగంట్యాడ:** నాగుల చవితిని నడుపూరు, సీతానగరం, నెల్లిముక్కు, దల్లివానిపాలెం, సిద్ధేశ్వరం, దయాల్‌నగర్, ఇస్లాంపేట, పాలవలస తదితర ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పుట్టలో పాలు పోసిన అనంతరం, పిల్లలు పరిసర ప్రాంతాల్లో ఆటపాటలతో గడిపారు.

**నవనాగశక్తి పుట్ట వద్ద..**

**ఉక్కునగరం :** ఉక్కునగరం త్రిశక్తి ఆలయం ఆవరణలో ఉన్న నవనాగశక్తి పుట్ట వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఫణిశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉక్కునగరం కాలభైరవ స్వామి ఆలయంలోని పుట్టలో భక్తులు పాలు పోశారు. ఆలయంలోని నాగేంద్రునికి పూజలు నిర్వహించారు. ఉక్కునగరంలో పుట్టలు, ఖాళీ ప్రదేశం అధికంగా ఉండటంతో గాజువాక, కూర్మన్నపాలెం, అగనంపూడి, ఉక్కునగరానికి చెందిన భక్తులు కుటుంబసభ్యులతో సహా విచ్చేసి పుట్టలో పాలు, గుడ్లు వేసి నాగేంద్రునికి పూజలు చేశారు.



అగనంపూడిలో పుట్ట వద్ద పాలు పోస్తున్న భక్తులు



ఉక్కు త్రిశక్తి ఆలయంలో నవనాగ శక్తికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



భెల్ టౌన్‌షిప్ వద్ద పుట్టలకు పోటెత్తిన భక్తులు



పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

## రోడ్డు విస్తరణ చేపట్టాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేస్తున్న గుడివాడ లతీష్

**అక్కిరెడ్డిపాలెం:** జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీ నుంచి గాజువాక హైస్కూల్ వెళ్లే రోడ్డును విస్తరించాలని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను కోరారు.
ఆయన్ను శుక్రవారం కార్యాలయంలో కలిసి, వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లతీష్ మాట్లాడుతూ గుడివాడ అప్పన్నకాలనీ, బొజ్జన్న కొండ ప్రాంతంలో రోడ్డు విస్తరణ జరగాలంటే ఏపీ ట్రాన్స్ కో స్థలాన్ని వినియోగించుకోవాల్సి ఉందన్నారు. ఈ స్థలం కోసం ఇప్పటికే ఏపీ ట్రాన్స్ కో అధికారులను కలిసి వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ సిబ్బంది భాస్కరరావు పాల్గొన్నారు.

## గౌరమ్మకు సారె సమర్పణ



గౌరమ్మకు సమర్పించిన సారెతో మహిళలు

**అక్కిరెడ్డిపాలెం:** వెంకటేశ్వర కాలనీ గౌరీ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న గౌరీ పరమేశ్వరుల మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గౌరమ్మకు సారె సమర్పించారు. ముందుగా అమ్మవారి సారెను వెంకటేశ్వరకాలనీ శీలానగర్‌లలో ఊరేగించారు. కార్యక్రమంలో ప్రతినిధులు మళ్ల వెంకట సీతారం, మళ్ల వీరవెంకట సత్యనారాయణ, కె.కృష్ణ, బొడ్డేటి నాయుడు, ఎస్.వి.ఎస్.నాయుడు, పెంటకోట ఉమామహేశ్వరరావు, ఈగలపాటి యువశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వరూపానందేంద్ర సరస్వతి జన్మదినం



స్వామీజీ ఆశీస్సులు అందుకుంటున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



బీసీ రోడ్డులో పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

**గాజువాక :** విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ జన్మదినాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు గాజువాకలో ఘనంగా నిర్వహించారు. గాజువాక దిశ అధ్యక్షురాలు మంత్రి మంజుల ఆధ్వర్యంలో బీసీ రోడ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం పలువురు అయ్యప్ప స్వాములకు, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వరూపానందేంద్ర సరస్వతి విశాఖ వాసి కావడం ఈ జిల్లా ప్రజల అదృష్టమని పేర్కొన్నారు. కార్యక్రమంలో 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, 76వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దొడ్డి రమణ, నాయకులు ఎన్ఎస్ఎన్ రెడ్డి, ప్రసాద్, ఆదిలక్ష్మి, పుష్ప, రామలక్ష్మి, సరోజిని, జ్యోతి, చాందిని, అనార్కలి, సహజన సింగ్, దశరథ్ సింగ్ పాల్గొన్నారు.

## సమాజాన్ని మేల్కొలిపేది సాహిత్యమే..



అద్దంకి రాఘవాచార్యులును సత్కరిస్తున్న దృశ్యం



పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

**పెదగంట్యాడ:** సమాజాన్ని మేల్కొలిపేది సాహిత్యమేనని సాహిత్య సుధ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాఘవాచార్యులు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెదగంట్యాడ శాఖ గ్రంథాలయంలో శుక్రవారం సాహిత్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష గ్రాంథికం నుంచి వ్యావహారిక భాషగా ఎలా పరిణతి చెందిందో వివరించారు. నన్నయ్య నుంచి రాయప్రోలు, గురజాడ, దేవులపల్లి, శ్రీశ్రీ వరకు ఎంతో మంది కవులు తమ సాహిత్యంతో సమాజాన్ని మేల్కొలిపారన్నారు. పోతన పద్యాలు సమాజానికి ఎంత దగ్గరగా ఉంటాయో వివరించారు. గ్రంథాలయాధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ అధికారి బి. అమ్మాజీ, పాఠకులు పాల్గొన్నారు.

**గాజువాక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన**

**గాజువాక :** జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గాజువాక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన చేపట్టారు. పుస్తక ప్రదర్శనలో చందమామ కథలు, అంకెలతో ఆటలు, బాలభారతం, బాల రామాయణం, పెద్ద బాలశిక్ష, భగవద్గీత, స్వేచ్ఛా విహంగం తదితర పుస్తకాలను అందుబాటులో ఉంచారు. పలువురు పాఠకులకు సభ్యత్వాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు

## నిబంధనలు బేఖాతర్

- కరెంటు వైర్ల కింద నిర్మాణం
- హడలిపోతున్న స్థానికులు



నీటి పైపు ఉన్న ప్రాంతంలో వేస్తున్న పిల్లర్



విద్యుత్ వైర్ల కింద చేపట్టిన నిర్మాణం

**అక్కిరెడ్డిపాలెం:** ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారికంగా ఓ వ్యక్తి 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం శివారు విశాఖ డెయిరీ గోడ పక్కన చేపడుతున్న నిర్మాణం చర్చనీయాంశమైంది. విద్యుత్ వైర్ల కింద పిల్లర్లు ఏర్పాటు చేశారని, నిర్మాణ సమయంలో విద్యుదాఘాతం ఏర్పడే పరిస్థితి ఉందని స్థానికులు హడలిపోతున్నారు. దీనిపై మిండి విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులకు తెలియజేయడంతో వారు వచ్చి హెచ్చరించినా పట్టించుకోకుండా తిరిగి నిర్మాణం ప్రారంభించడం విమర్శలకు తావిస్తోంది. నిర్మాణం జరుగుతు న్న స్థలంలో భూమి కింద వాటర్ సప్లై పైప్‌లైను ఉంది. ఎప్పుడైనా నీటి సరఫరాలో సమస్య తలెత్తితే, పరిస్థితి ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణం జరుగుతున్న స్థలం కూడా ఒకప్పుడు ప్రభుత్వ స్థలం అని, నకిలీ పత్రాలతో పట్టా సృష్టించారనే ఫిర్యాదులు ఉన్నాయి. దీనిపై ప్రశ్నిస్తున్న స్థానికులపై నిర్మాణదారుడు బెదిరింపులకు పాల్పడుతున్నారని అంటున్నారు. విద్యుత్ విభాగం, వాటర్ సప్లై విభాగం, జీవీఎంసీ అధికారులు స్పందించి, నిర్మాణదారునిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## బీజేపీ కన్వీనర్ల నియామకం

**గాజువాక :** బీజేపీ గాజువాక నియోజకవర్గం కన్వీనర్లను ఆ పార్టీ రాష్ట్ర కమిటీ శుక్రవారం నియమించింది. పార్టీ కన్వీనర్‌గా ప్రస్తుత కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావును, కో కన్వీనర్‌గా 87వ వార్డు నాయకుడు లక్కరాజు సోంబాబును నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఉత్తర్వులను జారీ చేశారు. తమపై నమ్మకంతో పదవుల్లో నియమించినందుకు గాను నర్సింగరావు అగ్ర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు 'గుడిలోవ' విద్యార్థులు

**ఆనందపురం:** రాష్ట్ర స్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు మండలంలోని గుడిలోవ విజ్ఞాన్ విహార్ విద్యార్థులు ఎంపికైనట్టు జిల్లా హ్యాండ్‌బాల్ సొసైటీ కార్యదర్శి ఎస్.గోపీకృష్ణ తెలిపారు. ఈ నెల 14న నగరంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న వెంకట సాయిలక్ష్మి, ఆరాధ్యసింగ్, దియానీతా మహతో, నికిత, మోక్షరత్నశ్రీ, విద్యాధరి, ఆకాంక్ష కాశ్యప్‌లు ఉత్తమ ప్రతిభ చూపారన్నారు. ఈ మేరకు వారు ఈ నెల 18, 19 తేదీల్లో ఏలూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది సత్కరించారు.

## నేడు ఏయూలో జాబ్‌మేళా

**ఏయూక్యాంపస్:** ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎంప్లాయ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు బ్యూరో డిప్యూటీ చీఫ్ దొరబాబు తెలిపారు. హెటిరో సంస్థ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో 25 ఖాళీల భర్తీకి ఫార్మసీ కోర్సులు, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ చేసిన వారు అర్హులు. వీరికి రూ.2.7 లక్షల వార్షిక వేతనం అందిస్తారు. జూనియర్ కెమిస్ట్‌లో 50 ఖాళీలు భర్తీ చేయనున్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ అభ్యర్థులు అర్హులు. జూనియర్ టెక్నీషియన్ ఉద్యోగాలకు ఐటీఐ ఫిట్టర్, మెకానికల్ డిప్లమో చేసిన వారు అర్హులు. మెడ్‌ప్లస్ సంస్థలో ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు ఫార్మసీ చదివిన వారు, ఫార్మసీ ఎయిడ్, సీఎస్ఏ, ఆడిట్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్ అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.12 వేలు నుంచి రూ.18 వేల వరకు వేతనం ఇవ్వనున్నారు. పూర్తి వివరాలకు 9666092491 నంబరులో సంప్రదించాల్సిందిగా దొరబాబు కోరారు.

## రైళ్లలో పేలుడు పదార్థాల రవాణా నేరం

డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్

**తాటిచెట్లపాలెం:** ప్రయాణికులు రైళ్లలో ప్రయాణించేటపుడు ఎట్టి పరిస్థితుల్లోనూ పేలుడు, మండే స్వభావం గల పదార్థాలను తమతో తీసుకెళ్లరాదని, ఇది ప్రమాదకరమని, శిక్షార్హమైన నేరమని డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తెలియజేశారు. ఇటీవల కాలంలో రైళ్లలో జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా టపాసులు, గ్యాస్ సిలిండర్లు, యాసిడ్, కిరోసిన్, పెట్రోల్ వంటి వాటిని రైళ్లు, రైల్వే స్టేషన్లలోనికి తీసుకురావొద్దన్నారు. ఇలా చేసిన వారికి మూడేళ్ల వరకు జైలు, జరిమానా విధించే అవకాశముందని ఆయన చెప్పారు. వీటి వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ విషయంలో వాల్తేర్ డివిజన్ ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేలుడు పదార్థాలు రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటివి గుర్తించిన వారు వెంటనే రైల్వే అధికారులకు, రైళ్లలో ఉండే సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. ప్రయాణికుల సహాయం కోసం 139 నంబర్‌ను సంప్రదించాలని డీఆర్ఎం సూచించారు.

## కార్మికుల పోరాటం స్ఫూర్తిదాయకం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

**కూర్మన్నపాలెం:** పరిశ్రమను కాపాడుకోవడం కోసం కార్మికులు ఇంతటి సుదీర్ఘ పోరాటం చేసిన చరిత్ర దేశంలోని ఏ పరిశ్రమకు లేదని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న దీక్ష చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1009వ రోజు, శుక్రవారం సంస్థలోని పలు విభాగాల కార్మికులతో పాటు ఓబీసీ నాయకులు పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు. కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడాలన్నారు. ప్లాంట్‌లో అన్ని విభాగాలను పునఃప్రారంభించి ఉత్పత్తిని పెంచాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

## వచ్చే నెల 17న వైజాగ్ మారథాన్

**విశాఖ స్పోర్ట్స్:** సాగరతీరంలో డిసెంబర్ 17న వైజాగ్ మారథాన్ జరగనుంది. వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ పరుగు నాలుగు విభాగాల్లో నిర్వహించనున్నారు. 21 కిలోమీటర్ల పరుగుతో పాటు 10 కి.మీ., 5 కి.మీ., 3 కి.మీ. పరుగు పార్క్ హోటల్ దరి వైఎస్సార్ విగ్రహం చెంత ప్రారంభించి అక్వేరియం, రోప్ వే మీదుగా రాడిసన్ హోటల్ వద్ద టర్న్ తీసుకుని తిరిగి వీఎంఆర్డీఏ పార్క్ వద్దకు చేరుకోవడంతో ముగియనుంది.ఈ సందర్భంగా శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ మాట్లాడుతూ వైజాగ్ మారథాన్ నిర్వాహకులు ఔత్సాహికులకు అందించే టీషర్ట్, మెడల్స్‌ను ప్రదర్శించారు. అల్పాహారాన్ని ఔత్సాహికులకు అందిస్తామని, దారి వెంట వైద్య సహాయకులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైజాగ్‌మారథాన్.కామ్ వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

## జాబ్‌మేళాలో 45 మంది ఎంపిక

**కంచరపాలెం :** కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి (క్లరికల్) తెలిపారు. సుమారు 7 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 360 ఉద్యోగ ఖాళీల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూల్లో 86 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 45 మంది ఎంపికైనట్లు ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. నిరుద్యోగులు జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఉద్యోగుల స్పందనకు 46 వినతులు



ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌వో మోహన్‌కుమార్

**మహారాణిపేట :** కలెక్టరేట్ ప్రాంగణంలోని డీఆర్వో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగుల స్పందనకు 46 వినతులు వచ్చాయి. జిల్లా, మండల కార్యాలయాల్లో విధుల నిర్వహించే వివిధ క్యాడర్లకు చెందిన ఉద్యోగులు పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఫిర్యాదులను అందజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్‌కుమార్, ఏవో ఈశ్వరరావు ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించారు. నిర్దేశిత కాలంలో వీటికి పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని డీఆర్వో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సౌకర్యార్థం ప్రతి నెలా మూడో శుక్రవారం ఉద్యోగుల స్పందన నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.